
క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీసమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామికి విశేష అలంకరణ చేశారు. ఆలయంలోని శివసాధంలో స్వామికి శాంతి కల్యాణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్వీ సాగర్ పర్యవేక్షణలో పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో ఎం.గంగాధర రావు, భక్తులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని 45 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహం వద్ద దాసాంజనేయ స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాదాపు ఆరు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన



విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణించి విజయవాడ ఖ్యాతిని నలు దిశల చాటాలని చదరంగం క్రీడాకారుడు టి.నిశ్చల్‌కు సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ తరుణ్ సూచించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత చిన్నారుల చదరంగం పోటీల్లో విజయవాడకు చెందిన నిశ్చల్ బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో క్రీడాకారుడు నిశ్చల్‌ను ప్రిన్సిపాల్ బుధవారం అభినందించారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో పతకం సాధించిన స్ఫూర్తితోనే అంతర్జాతీయ క్రీడ వేదికలపైన సత్తా చాటాలని చెప్పారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే ప్రతి ఏటా ఎక్స్‌రే, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే గ్రూప్ సంస్థల ప్రధాన బాధ్యులు కొల్లూరి అన్నారు. సాంబమూర్తి రోడ్డులో బుధవారం 65 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఏటా వేసవిలో ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, అంజలి, గీతాంజలి, దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 వరకు 65 రోజులుగా దాదాపు 15,000 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయపడే మనస్తత్వం అలవర్చుకోవాలని కోరారు. వేసవి మండే ఎండలలో వడగాల్పులను సైతం లెక్కచేయక అకుంఠిత దీక్షతో మజ్జిగ పంపిణీ నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. మజ్జిగ పంపిణీ చైర్మన్ గోపు రాము, వైస్ చైర్మన్ పొత్తూరి సీతారామారావు సభ్యులు కనకవల్లి, చామర్తి వెంకట సుబ్బయ్య, బ్రహ్మదేశం వసంత కుమార్, గుర్రం ఏడుకొండలు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్–2024 ఫలితాల్లో 720 మార్కులకు గాను దేవిరెడ్డి హేమహరిణి-676, రవళిక మచ్చ-676, భార్గవ్ నూతక్కి-673 మార్కులు సాధించారని శ్రీ భవిష్య అకాడమీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావుఒక ప్రకటనలో తెలిపారు. 667, 664, 662 వంటి అత్యధిక మార్కులతో పాటు 600 మార్కులకు పైగా 60 మంది, 550కి పైగా 173 మంది, 500కి పైగా 243 మంది, 480కి పైగా 301 మంది, 450కి పైగా 386 మంది తమ విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి



నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు



కంకిపాడులో మొక్కలు నాటుతున్న సీడీపీఓ బేబి సుకన్య

నున్న(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కెనడీ హైస్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నున్న గ్రామంలోని కెనడీ ఇంగ్లిష మీడియం హైస్కూల్‌లో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షణపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు భూ పునరుద్ధరణ, కరువును తట్టుకోవడం తదితర అంశాలపై పోస్టర్ల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రత్నకృష్ణ, ఉపాధ్యాయులు సృజన, మాధవి, ఉషస్విని, దివ్య, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ బేబి సుకన్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కంకిపాడు బ్యాంకు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటించి, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ బేబి సుకన్య మాట్లాడుతూ భూమికి జీవం నింపటానికి, కరువు నియంత్రణకు మొక్కలు పెంపకం ఒక్కటే మార్గమన్నారు. న్యూట్రీగార్డెన్, కిచెన్ గార్డెన్‌ల ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలను భుజించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. తద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నళినీకుమారి, డి.లక్ష్మి, ఎం.రత్నకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శి రమ, ఎంసీహెచ్‌వీ మంజు, తల్లులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులతో ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే మునగాకు, కరివేపాకు, తోటకూర, బచ్చలికూర మొక్కలను అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మి నాటించారు.

సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెనుక కుట్ర

జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెనుక ముమ్మాటికీ కుట్ర దాగి ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..దేశ చరిత్రలోనే ఎక్కడ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున్న సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేసినట్లు తెలిపారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ ఘోర ఓటమి చెందడం రాష్ట్ర ప్రజలందరికీ విస్మయానికి గురిచేసిందన్నారు. ఇది వైఎస్సార్ సీపీ ఓటమి కాదని, టీడీపీ, జనసేన, బీజేపీ చేసిన కుట్రగా ఆమె పేర్కొన్నారు. డిఫాల్ట్ చిప్‌తో డిజైన్ చేసిన ఈవీఎంలను టాంపరింగ్ చేశారనే సందేహం ప్రజల్లో ఉందన్నారు. వైఎస్సార్ సీపీకి గట్టి పట్టున్న గ్రామాల్లో కూడా టీడీపీకి మెజార్టీ రావడం ఈ అనుమానాలను నిజం చేస్తుందన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణానది ఒడ్డున ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కోవిడ్ పార్క్ వద్ద అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నది ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక వికాసం నేపథ్యంలో అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆ క్రమంలో విలాస వస్తువుల నుంచి వచ్చే వివిధ వాయువులు లేదా ఇతర కాలుష్యాల నుంచి పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు సాధ్యమైనంత వరకూ కాలుష్యాన్ని విడుదల చేసే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా నదీజలాలు కలుషితం కాకుండా అందరూ కృషి చేయాలన్నారు. తాగునీరు కలుషితం కావటం వలన ఇటీవల నగరంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు వాటిపై ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయభాస్కర్ నిర్వహించారు.



నది ఒడ్డున ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఈవీఎంలు మొరాయించడంతో వీవీప్యాట్ల లెక్కింపు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రధానంగా 22 రౌండ్లలో లెక్కించారు. 92వ పోలింగ్ స్టేషన్ (తాడిగడప), 234వ పోలింగ్ స్టేషన్‌కు (పెద ఓగిరాల) సంబంధించి ఈవీఎంలు సాంకేతిక లోపం కారణంగా 23వ రౌండ్ ప్రత్యేకంగా నిర్వహించి వీవీప్యాట్ స్లిప్పులను ఓట్ల లెక్కింపు పరిగణలోకి తీసుకున్నారు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లో టీడీపీ ముందంజ లోనే ఉంది. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లలో కూడా 1,120 ఓట్లు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌కు వచ్చాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ కన్నా టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌కు 59,915 ఓట్లు సాధించారు.



ఓట్లు లెక్కిస్తున్న అధికారులు (ఫైల్)

క్యాన్సర్ శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చులకు గానూ బుధవారం సాయి మణికంఠ కేటర్స్ అధినేత జొన్నలగడ్డ రమేష్ బాబు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నగరానికి చెందిన సుబ్బు కుమార్తె చిన్నారి వేముల గీర్వాణి నిత్యశ్రీ క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు. చిన్నారికి శస్త్రచికిత్స సత్వరమే చేయాలని ఇందుకుగానూ రూ.35 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పారు. దీంతో రమేష్‌బాబు తన వంతు సాయంగా రూ. 25 వేలు చిన్నారి తండ్రి సుబ్బుకు అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం 63వ డివిజన్ పాత, కొత్త రాజీవ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వాతావరణంలో చోటుచేసు కొన్న మార్పుల కారణంగా ప్రజలు నివసించే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం, ఆ ప్రాంతాల్లో సున్నం చల్లించడం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు. ప్రతి రోజూ డ్రైనేజీ కాల్వల్లో స్కిల్ట్ లేకుండా చూడాలని, మురుగునీరు కాల్వల్లో నిలబడకుండా చూడాలన్నారు. మురుగుకాల్వలకు సమీపంలో వున్న తాగునీటి పైపులైన్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించడం, శాంపిల్స్ సేకరించడం జరుగుతుందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్యసిబ్బందితో సర్వే చేయిస్తున్నట్లు తెలియజేశారు.



ఎస్పీ బాలు గీతాలు అజరామరం



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు పద్మశ్రీ డాక్టర్ శ్రీపాద పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలు) స్వరం చిరస్మరణీయమని, ఆయన స్వరం నుంచి వెలువడిన గీతాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాల్‌లో నిర్వహించిన దశకంఠుడు ఎస్పీ బాలు స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఎస్పీ బాలు గానం చేసిన పలు గీతాలను ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీలతో పాటు పలువురు గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు.

గాన గంధర్వుడు ఎస్పీ

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సినీ రంగంలో అనేక మంది ప్రముఖ హీరోలకు వారి గొంతులకు అనుగుణంగా పాటలు పాడిన బాలును సినీ ప్రియులు మరిచిపోలేరన్నారు. కేవలం సినీ గీతాలే కాకుండా అనేక ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలను నేటికి భక్తుల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సినీ రచయిత వేటూరు గీతాలపై పరిశోధన చేసిన డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ వేటూరి వంటి ఎందరో మహానుభావులు రచించిన పాటలకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తరువాత ఆ స్థానాన్ని భర్తీ చేసిన ఎస్పీ బాలును గాయక లోకం మరిచిపోదన్నారు. కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కాగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి నిశిక వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన తండ్రి బాజీరావు చిన్నారి ఆపరేషన్ సాయానికి దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసుల తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర, గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్ర బాబు, బ్రహ్మం హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలు తండ్రి బాజీరావుకు నగదును అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి బాజీరావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.



చిన్నారి తండ్రి బాజీరావుకు నగదు అందజేస్తున్న సీఐ మహేంద్ర

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హరిణి, హేమ, వివక్ష, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడల్లోనూ సత్తా చాటాలి

కంకిపాడు: క్రీడల్లోనూ సత్తా చాటాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. కథల పోటీలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పఠనం, శ్లోకాల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపికచేశారు. సునీత మాట్లాడుతూ గ్రంథాలయాల్లో లభించే విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెనమలూరు: గ్రంథాలయ శిక్షణ తరగతుల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పెనమలూరు గ్రంథాలయంలో కొద్ది రోజులుగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం, ఆటపాటలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని విద్యార్థులు శిక్షణ తరగతుల్లో పాల్గొని విజ్ఞానం పెంపొందించుకుంటున్నారని గ్రంథాలయ అధికారి హరీష తెలిపారు.

ఆటల పోటీలతో విద్యార్థుల్లో ఉల్లాసం

గన్నవరం రూరల్: ఆటపాటలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. బుధవారం స్థానిక లైబ్రరీలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులలోని సృజనను వెల్లడి చేశాయని, పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించాయని, నీతి కథలు చదవటం ద్వారా నైతిక ఎదుగుదలకు బాటలు వేశాయని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా విద్యార్థులు న్యూస్ పేపర్‌లు చదివారని చెప్పారు. గ్రంథాలయ శాఖ ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపుకు విశేష ఆదరణ లభించిందన్నారు. విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు పంపిణీ చేశారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో విద్యార్థులకు చెస్, లూడో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా పఠనాసక్తిని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని బ్యాంకు విశ్రాంత ఉద్యోగి ఎస్.బాబూరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయాలు–ప్రయోజనాలు అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పటం, కథలు చదివించటం, జనరల్ నాలెడ్జ్, నృత్యాలు, చెస్, క్యారమ్స్, ఇండోర్ గేమ్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం లైబ్రేరియన్ స్వర్ణ లతాదేవి, రిటైర్డ్ ఉద్యోగి ఎన్.బాబూరావు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ అవకాశాలు పెంపొందించుకోవాలని కోరారు.

ఉంగుటూరు: మండలంలో శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు బుధవారం ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శిబిరాలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఉంగుటూరులో మ్యూజికల్ చైర్స్ ఆటలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లో గ్రంథాలయల్లో పుస్తక పఠనం, కథలు, న్యూస్ పేపర్ చదివించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, స్నేక్ అండ్ లేడర్, లెమన్ స్పూన్ వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.



ఉంగుటూరులో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో క్యారమ్స్ నేర్చుకుంటున్న చిన్నారులు



పెనమలూరు గ్రంథాలయ శిక్షణ తరగతుల్లో విద్యార్థులు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో ఆటల పోటీల్లో విద్యార్థులు

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన, పుస్తక సమీక్ష, కథల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు జరిగాయి. పోటీలను గణపతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అసాధారణ నైపుణ్యం దాగి ఉంటుందని, అది వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గురువారం క్యారమ్ బోర్డ్, చదరంగం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలి పిలుపునిచ్చారు. విజేతలకు 7న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.